సాక్షి రంగారెడ్డి

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



ఆధునిక ప్రయాణ ప్రాంగణం

ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన చేవెళ్ల బస్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. 10లో▸



డ్రైనేజీని వాగులో కలపొద్దు

మురుగు కాలువను పులందరి వాగుకు అనుసంధానం చేయవద్దని ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. 10లో▸



గోదాంలో అగ్ని ప్రమాదం

ఈ వెంట్ స్టేజిలకు ఉపయోగించే ఫైబర్ సెట్టింగ్ సామగ్రి నిల్వ గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. 10లో▸

న్యూస్‌రీల్

బడ్జెట్ ఆశాజనకంగా ఉంటుంది

- రోడ్లు, రైల్వే పనులకు ప్రత్యేక ప్రతిపాదనలు
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్ ఆశాజనకంగా ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేలా.. కొత్త పనులు మొదలుపెట్టేలా నిధుల కేటాయింపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్- బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులను సత్వరమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశానన్నారు. లింగంపల్లి నుంచి తాండూరు వరకు ఎంఎంటీఎస్ సర్వీసులు పొడిగించడం, కొత్తగా మరో రెండు రైల్వే లైన్ల ఏర్పాటు, రైల్వే గేట్‌తో స్థానికులు పడుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు 12 ఆర్వోబీలను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. శంకర్‌పల్లి నుంచి వయా మోమిన్‌పేట్ మీదుగా మర్పల్లి వరకు, వికారాబాద్-సదాశివపేట్ రహదారుల విస్తరణ చేపట్టాలని, దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. శంకర్‌పల్లి సమీపంలో 40 కిలోమీటర్ల పొడవున వినియోగం లేని రైల్వే ట్రాక్‌ను పర్యాటక రంగానికి కేటాయించాలని, ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించనున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ అర్బన్, రూరల్ ఏరియాలను కలుపుతూ రీజనల్ రింగ్ రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పాటు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని పలు స్టేషన్లలో వివిధ రైళ్లను నిలపాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు విశ్వేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా శంకర్‌నాయక్



శంకర్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా శంకర్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతవరకూ ఈస్థానంలో పని చేసిన వసంత మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అవగా.. సచివాలయంలో నీటి పారుదల శాఖ విభాగంలో పనిచేస్తున్న శంకర్‌నాయక్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌ను కలిసిన సిబ్బంది మర్యాదపూర్వకంగా సత్కరించారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు.

షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా సునీత



సునీత

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న శుక్రవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సునీతను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రెండేళ్లుగా ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న వెంకన్నను సచివాలయానికి బదిలీపై వెళ్లారు. నారాయణపేట కమిషనర్‌గా పని చేస్తున్న సునీత షాద్‌నగర్‌కు వచ్చారు. ఆమె గతంలో షాద్‌నగర్ మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహించారు.

ప్రభుత్వం మారినా.. రోడ్లు మారలే



పెద్దమంగళారం- చందానగర్ రోడ్డును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా రోడ్ల పరిస్థితి మారలేదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి విమర్శించారు. మొయినాబాద్‌లోని పెద్దమంగళారం- చందానగర్ రోడ్డును శుక్రవారం సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రహదారి పూర్తిగా గుంతలమయమైందన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్లన్నీ బాగు చేయాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు రాములు, పాండుగౌడ్, కృష్ణయ్య, హరి, జంగయ్య, రమేశ్, అనురాధ, శ్రీనివాస్, దర్శన్ ఉన్నారు.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశానికి హాజరైన విద్యార్థులు

పులకించిన మొగిలిగిద్ద

వైభవంగా ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి
- పూర్వ విద్యార్థులు, మేధావులు, అతిథులతో సందడి వాతావరణం
- గ్రామానికి సీఎం వరాల జల్లు



సరస్వతీదేవి విగ్రహానికి పూల మాల వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సభలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అతిథులు

ఎంతో మంది మేధావులతో అక్షరాలు దిద్దించిన పాఠశాల.. పూర్వ విద్యార్థులు, అతిథుల సందడితో పులకించింది. చదువులమ్మ ఒడికి చేరిన పాత, ప్రస్తుత విద్యార్థులు జ్ఞాపకాల జడిలో మునిగిపోయారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించిన మొగిలిగిద్ద స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో వీరి ఆనందం రెట్టింపైంది.

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పూర్వ విద్యార్థి, పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలకరించారు. ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యాశాఖ అధికారులు ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. స్కూల్, గ్రామ చరిత్ర, నాటి నవాబుల పాలనకు సంబంధించిన ఫొటోలను ఇందులో ప్రదర్శించారు. స్కూల్‌కు సంబంధించి వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాలను సీఎం ఆసక్తిగా తిలకించారు. పాఠశాల పూర్వ విద్యార్థులను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బహిరంగ సభకు వెళ్లే ముందు అందరితో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎంను శాలువాతో సన్మానించారు.

భారీగా నిధులు మంజూరు

మొగిలిగిద్దకు సీఎం వరాల జల్లు కురిపించారు. అత్యాధునిక వసతులతో పాఠశాల నూతన భవనానికి రూ.10 కోట్లు, గ్రంథాలయ నిర్మాణం కోసం కోటి రూపాయలు, గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, తాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాల రూపకల్పకు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అడ్వాన్స్‌డ్ సెంటర్‌తో పాటు ఎమ్మెల్యే శంకర్ కోరిక మేరకు గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

పటిష్ట బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టారు. పాఠశాల, బహిరంగ సభ ప్రాంగణంలోకి వెళ్లే వారితో పాటు సభావేదికను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

తరలివచ్చిన జనం

సీఎం బహిరంగ సభకు వివిధ గ్రామాల నుంచి జనం భారగా తరలివచ్చారు. సుమారు పదివేల మందితో సభా ప్రాంగణం నిండిపోయింది. హెలిపాడ్ నుంచి బహిరంగ సభకు వచ్చే దారిలో, పరిగి రోడ్డు గుండా పార్టీ నాయకులు, కార్యకర్తల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కేరింతలు కొట్టారు.

సభ సైడ్ లైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4.40 నిమిషాలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మొగిలిగిద్దకు వచ్చారు.
- స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.
- సాయంత్రం 4.45 నిమిషాలకు హెలిపాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ పాఠశాలకు చేరుకుని ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.
- 5గంటలకు పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహానికి పూల మాలలు వేశారు.
- అనంతరం అరగంట పాటు పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు.
- 5.30 గంటలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పాఠశాల నుంచి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు.
- 5.40నుంచి 6గంటల వరకు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రసంగించారు.
- 6.10 నిమిషాలకు హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్ బయలుదేరారు.

భవిష్యత్తుకు పునాదులు

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఇది గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. షాద్‌నగర్‌కు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఉత్తమ పనితీరుకు గుర్తింపు

నగర కమిషనరేట్‌లో 706 మందికి రివార్డులు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తమ పనితీరును కనబర్చిన నగర పోలీసు అధికారులకు కొత్వాల్ సీవీ ఆనంద్ రివార్డులు అందించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీ ఐసీసీసీ) జరిగిన కార్యక్రమంలో 706 మంది అధికారులు, సిబ్బందికి వీటిని అందించారు. వీరిలో ఆరుగురు అదనపు డీసీపీలు, 13 మంది ఏసీపీలు, 73 మంది ఇన్‌స్పెక్టర్లు, 83 మంది ఎస్సైలు, 12 మంది ఏఎస్సైలు, 86 మంది హెడ్-కానిస్టేబుళ్లు, 334 మంది కానిస్టేబుళ్లు, 29 మంది హోంగార్డులతో పాటు 64 మంది మినిస్టీరియల్ సిబ్బంది, ఆరుగురు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఉత్తమ దర్యాప్తు బృందంగా సీసీఎస్‌లో పని చేసే ఏసీపీ వై హరీష్ కుమార్, టీమ్-1 ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు, ఎస్సైలు ఎస్.రవి కుమార్, బి.జయంత్‌లు కమీషనర్ ట్రోఫీ గెల్చుకున్నారు. సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్ రావు, ఎస్సైలు కె.వెంకటేష్, సీహెచ్ మహిపాల్, ఎ.మాధవిలకు ఈ ట్రోఫీ లభించింది. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషిని సీపీ అభినందించారు.



మాట్లాడుతున్న కొత్వాల్ సీవీ ఆనంద్

మళ్లీ నోటీసులు!

- వ్యక్తిగతంగా హాజరు కావాలని కలెక్టర్ తాఖీదులు
- ఫార్మా బాధిత రైతుల్లో ఆందోళన

యాచారం: పట్టా రైతులకు మళ్లీ నోటీసులు అందాయి. ఫార్మాసిటీ కోసం బలవంతంగా భూసేకరణ చేస్తున్నారంటూ కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పట్టా భూములు ఇవ్వకపోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు కలెక్టర్ నారాయణరెడ్డి రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 8న మధ్యాహ్నం 3గంటలకు వ్యక్తిగతంగా హాజరై అభ్యంతరాలు తెలియజేయాలని సూచిస్తూ సెక్షన్ 15(2) ఆఫ్ యాక్ట్ ఆఫ్ 2013 కింద నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన దాదాపు 1,500 మందికి పైగా రైతులు సుమారు 2,200 ఎకరాలకుపైగా పట్టా భూములను ఫార్మాసిటీకి ఇచ్చేందుకు నిరాకరించారు. ఈ విషయంలో అప్పటి అధికారులు బాధితులను ఇబ్బందులకు గురి చేశారు. దీంతో చేసేదేమీ లేక హైకోర్టును ఆశ్రయించారు. ఈఅంశాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు 2,200 ఎకరాలకు పైగా పట్టా భూములకు సంబంధించి రాత్రికి రాత్రే అవార్డు పాస్ చేసి, పరిహారం డబ్బులను అథారిటీలో జమచేశారు. అనంతరం భూసేకరణ సేకరణ ప్రక్రియ పూర్తయినట్లు భావించి రైతుల భూరికార్డులను టీజీఐఐసీ మీద మార్చేశారు. టీజీఐఐసీ పేరు మీద మార్చిన భూ రికార్డులను తమ పేర్లపైకి బదిలీ చేయించాలంటూ బాధితులు న్యాయస్థానం మెట్లెక్కారు. దీంతోపాటు ఐదేళ్లుగా సీసీఎల్ఏ, కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండాపోయింది. టీజీఐఐసీ పేరున కొనసాగుతున్న భూములను తమ పేర్లపై మార్చాలని కోరుతూ రైతులు గత గురువారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. వెంటనే స్పందించిన ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. సదరు భూములను రైతుల పేరున మార్చాలని కోరారు. అనంరతం రైతులు నేరుగా వెళ్లి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కానీ మరుసటి రోజునే వ్యక్తిగత నోటీసులు అందించడంపై బాధితులు విస్మయానికి గురయ్యారు. ఇదే విషయమై యాచారం తహసీల్దార్ అయ్యప్పను సంప్రదించగా పట్టా భూముల సేకరణ, రైతుల అభ్యంతరాలు, కోర్టుకు వెళ్లిన అంశాలను తెలుసుకునేందుకు కలెక్టర్ జారీ చేసిన నోటీసులను రైతులకు అందిస్తున్నామని తెలిపారు.



కలెక్టరేట్ నుంచి వచ్చిన నోటీసులను కుర్మిద్ద గ్రామ రైతులకు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాట ఉన్నంతకాలం గద్దర్ ఉంటారు

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- ఘనంగా 77వ జయంతి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

అనంతగిరి: గద్దర్ అనేది ఒక పేరు కాదు అది ఒక కెరటం అని, సమాజంలో జరుగుతున్న అన్యాయంపై పాట రూపంలో తిరగబడిన బల్లెం అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి, భాషా సాంస్కృతిక శాఖ సారథ్యంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్పీకర్. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గద్దర్‌తో రాజకీయ నాయకులకు సిద్ధాంత పరమైన విభేదాలు ఉండొచ్చే కానీ బడుగు, బలహీన వర్గాలకు న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. దొరతనాన్ని ఎదిరించి గజ్జె కట్టి పాట పాడినా, తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్యం చేసినా అది సమాజాన్ని మేల్కొలిపే ఉద్యమమే అన్నారు. కళాకారులు గద్దర్‌ను స్మరిస్తూ పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రజా ప్రభుత్వం వచ్చాక గద్దర్‌ను కళాకారుడిగా, తెలంగాణ ఆస్తిగా గుర్తించిందని తెలిపారు. సినిమా కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయించిందని గుర్తు చేశారు. గద్దర్ కూతురు వెన్నెలను తెలంగాణ సాంస్కృతిక సారథిగా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, డీపీఆర్ఓ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ మండలంలో శుక్రవారం రూ.8.43 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జెడ్పీటీసీ మాజా సభ్యుడు మైపాల్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రత్యేక అధికారులు ప్రసన్నలక్ష్మి, కల్పన, పంచాయతీ కార్యదర్శులు శిల్ప, రుక్మిణి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లో అవగాహన కార్యక్రమం, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడపడం ముఖ్యం కాదని.. అప్రమత్తంగా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నడపడం అవసరమన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, రోడ్డు రవాణా శాఖ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ జాఫర్, ఆర్డీవో వాసుచంద్ర, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీని వాగులో కలపొద్దు


పనులు నిలిపివేయాలని ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రజలు


ఎంపీపటేల్‌గూడలో భారీగా మోహరించిన పోలీసులు

- నిర్మాణ పనులను అడ్డుకున్న ఎంపీపటేల్‌గూడ ప్రజలు
- నచ్చజెప్పిన పోలీసులు.. పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: మురుగు కాలువను పులందరి వాగుకు అనుసంధానం చేయవద్దని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. డ్రైనేజీ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడలో రూ.50 లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మైహోమ్స్ కాలనీ నుంచి ఎంపీపటేల్‌గూడ పులందరి వాగు వరకు పనులు చేపట్టగా.. పటేల్‌గూడ పట్టణ వాసులు నిరసన వ్యక్తంచేశారు. మురుగు నీటిని వాగులో కొలపొద్దని భీష్మించారు.

మురుగరు నీరే కదా, కలపొచ్చు

మురుగు జలాలను పులందరి వాగులో కలపొద్దని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తంచేయగా.. కొంతమంది రాజకీయ నాయకులు మురికి నీరే కదా, కాలువలో కలపొచ్చని మునిసిపాలిటీ అధికారులకు మద్దతుగా నిలిచారు. పరిస్థితిని కమిషనర్ పర్యవేక్షించారు.

నిఘానీడలో పనులు షురూ

వాగులో మురుగు కాలువను విలీనం చేయొద్దని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. ముందస్తు జాగ్రత్తగా పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. అయినప్పటికీ కొంతమేర నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. మురుగు నీరు రోడ్డుపై పారితే బాగుండదని పోలీసులు నచ్చజెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. వెంచర్ల నిర్వాహకులు సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని పటేల్‌గూడ ప్రజలు అధికారులను ప్రశ్నించారు. సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి ఓ వెంచర్‌లో శుక్రవారం లభ్యమయింది. ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని చర్చి ఎదురుగా ఉన్న గణేశ్ గార్డెన్ వెంచర్‌లో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల లోపు వయసున్న వ్యక్తి మృతదేహం పడుంది. మృతుడి ఒంటిపై ఉన్న చొక్కాకు ఎంఎస్ మెన్స్ పేరిట స్టిక్కర్ ఉండగా.. ఈ టైలర్ నల్లగొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలో ఉన్నట్లు తెలుస్తోంది. గుర్తుపట్టలేనంతగా మృతదేహం ఉండటంతో.. ఐదారు రోజుల క్రితం ఎక్కడి నుంచో ఆ దేహాన్ని తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆధారాల కోసం క్లూస్ టీమ్‌ను రప్పించారు. డిండి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా అనుమానం ఉందని, ఆ ప్రాంతం చుట్టుపక్కల ఎవరైనా తప్పిపోయినట్లయితే.. 8712571489, 8712662419 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు.


మృతదేహంపై ఉన్న చొక్క స్టిక్కర్

నలుగురు పేకాట రాయుళ్లపై కేసు


శంకర్‌పల్లి: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు అయింది. కేసు వివరాలను శుక్రవారం సీఐ శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. పట్టణంలోని సాయిబాబ థియేటర్ పక్కన ఉన్న ఓ గదిలో గురువారం సాయంత్రం నలుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు.. స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం భానూరుకి చెందిన ఎం.వెంకట్‌రాంరెడ్డి, చేవెళ్ల మండలం ఎన్కెపల్లికి చెందిన రాజేందర్‌రెడ్డి, బి.నాగయ్య, శంకర్‌పల్లి మండలం పర్వేదకి చెందిన జి.భరత్‌రెడ్డి పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.34,670 నగదు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులతో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు గదిని ఇచ్చిన యాజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నమాజ్‌కు వెళ్లిన యువకుడి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: నమాజ్ కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేంద్ర రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బైరాంపూర్ జిల్లా ఈటా రాంపూర్‌కు చెందిన రహ్మత్‌అలీ (25) తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల ఫ్యాబ్‌సిటీలో పని చేస్తుండేవాడు. జనవరి 24న (శుక్రవారం) మధ్యాహ్నం నమాజ్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో అతని స్నేహితులు తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో స్వగ్రామానికి ఫోన్ చేశారు. అక్కడికి కూడా రాలేదని చెప్పడంతో ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన యువకుడి వద్ద ఫోన్ లేదు. హిందీ మాట్లాడుతాడు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 8712578845, 8712662671కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.


రహ్మత్‌అలీ

ఆధునిక ప్రయాణ ప్రాంగణం


చేవెళ్ల కొత్త బస్టాండ్


పాత బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

రూ.6 కోట్లతో 8 ప్లాట్ ఫాంలు
- తుదిదశలో విస్తరణ పనులు
- త్వరలో ప్రారంభం
- నెరవేరనున్న ప్రాంత ప్రజల కల

చేవెళ్ల: ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన చేవెళ్ల బస్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. విస్తరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని ప్రస్తుత పాత బస్టాండ్.. జనాభాను అనుగుణంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన ప్యాసింజర్స్‌తో నిత్యం రద్దీగా ఉంటోంది. నిత్యవసరాలకు కష్టంగా మారింది. వసతుల లేమి కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ప్రతిరోజు వందల కొద్ది బస్సులు, వేల కొద్ది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్టాండు నిర్మాణం అనివార్యమయింది.

2018లో శంకుస్థాపన

కొత్త బస్టాండ్ అంశం ఏళ్లతరబడి వాయిదా పడుతూ వచ్చింది. 2018లో అప్పటి రవాణశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి.. ప్రస్తుత బస్టాండ్ వెనకాలే.. కొత్త బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధులు లేకపోవడంతో పనులు జరగలేదు. 2022లో నాటి ఎంపీ రంజిత్‌రెడ్డి చొరవతో చేవెళ్ల బస్‌స్టేషన్ విస్తరణకు మార్గం సుగుమయింది. హెచ్ఎండీఏ నుంచి రూ.6 కోట్లు నిధులు మంజూరు చేయించటంతో పనులు ప్రారంభించారు.

పాత బస్టాండు వెనకాలే..

పాత బస్టాండు వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో నూతన ప్రాంగణం నిర్మించారు. పనులు పూర్తి కావచ్చాయి. ఈ బస్టాండులో 8 ప్లాట్ ఫాంలు ఉన్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలు నిర్మించారు. ఇతర సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సులు నిలిపేందుకు కావాల్సిన స్థలం, ప్రైవేటు వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. బస్టాండు చుట్టూ గ్రీనరికోసం చెట్లు పెంచాలనే ఆలోచనతో మొక్కలు నాటించారు. మిగతా పనులు పూర్తికాగానే.. బస్టాండును ప్రారంభించేందుకు అధికారులు, పాలకులు సన్నాహాలు చేస్తున్నారు. బస్టాండ్ ప్రారంభంతో చేవెళ్ల ప్రజల కల నెరవేరనుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం



హెచ్ఎండీఏ నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆధునిక బస్టాండ్‌ను త్వరలో ప్రారంభిస్తాం. చిన్నచిన్న పనులు ఉన్నాయి. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. పనులు పూర్తికాగానే.. వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాము. బస్టాండ్ నిర్మాణానికి నిధులు ఇచ్చిన హెచ్ఎండీఏకు కృతజ్ఞతలు. – కాలె యాదయ్య, ఎమ్మెల్యే చేవెళ్ల

చిన్నారిపై వీధికుక్కల దాడి

రాజేంద్రనగర్: అపార్ట్‌మెంట్ ఎదుట ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన శుక్రవారం రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ రోడ్డు నంబర్–6లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాధ కుటుంబం నగరానికి వలస వచ్చి రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ రోడ్ నంబర్–6లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తోంది. వీరి కుమార్తె సుహాసిని (4) శుక్రవారం ఉదయం అపార్ట్‌మెంటు ముందు ఆడుకుంటుండగా రెండు వీధి కుక్కలు చిన్నారిపై దాడి చేశాయి. కిందపడిన బాలికను కుక్కలు కాలు పట్టుకుని 10 అడుగుల మేర లాక్కెళ్లాయి. దీంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి అరుపులు విన్న ఆమె తల్లి కుక్కలను తరిమి కుమార్తెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం చిన్నారి సుహాసిని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

- స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిల నిర్మాణానికి అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక
- కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ సాహేర్
- బడంగ్‌పేట్‌లో తాపీ మేస్త్రీలకు బహుమతుల అందజేత


బడంగ్‌పేట్‌లో మేస్త్రీలకు బహుమతులు అందచేస్తున్న భారతి సిమెంట్ ఇంజనీర్లు

బడంగ్‌పేట్: సిమెంట్ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహమ్మద్ సాహేర్ అన్నారు. శుక్రవారం బడంగ్‌పేటలోని శ్రీనివాస స్టీల్ దుకాణంలో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని తెలిపారు. కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోడిలా వేలాడమన్నాడని స్నేహితుడినే చంపేశాడు!

సాక్షి, సిటీబ్యూరో: సెల్‌ఫోన్ విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన వివాదం చివరకు హత్యకు దారి తీసింది. గత నెల 16 ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా.. నగరంలోని ఫలక్‌నుమాలో తలదాచుకున్న ఈ కేసులోని ఇద్దరు నిందితులను శుక్రవారం ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి అక్కడికి తీసుకెళ్లారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని సోనియా విహార్ ప్రాంతానికి చెందిన సోహైల్, షంషుద్దీన్ స్నేహితులు. షంషుద్దీన్ చికెన్ షాపులో పని చేస్తుండగా.. సోహైల్ మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. షంషుద్దీన్ తన వద్ద ఉన్న పాత సెల్‌ఫోన్‌ను విక్రయించాలంటూ సోహైల్‌కు ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా సెల్‌ఫోన్ గాని.. విక్రయించగా వచ్చిన సొమ్ము గాని షంషుద్దీన్‌కు చేరలేదు. దీంతో వీరి మధ్య వివాదం నెలకొంది. షంషుద్దీన్ గత నెల 14న సోహైల్‌తో గొడవపడి భయపెట్టాడు. తాను పని చేస్తున్న చికెన్ షాపులో కోళ్లు వేలాడుతున్న తరహాలో ఓ చెట్టుకు వేలాడాలని హెచ్చరించాడు. కోడిలా వేలాడిన సోహైల్‌ను వీడియో తీసిన షంషుద్దీన్.. 48 గంటల్లో తన ఫోన్ తిరిగి ఇవ్వకపోతే దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో అహం దెబ్బతిన్న సోహైల్.. షంషుద్దీన్ ఇచ్చిన 48 గంటల సమయంలోనే అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. తన స్నేహితుడైన మహ్మద్ అస్సతో కలిసి గత నెల 16న షంషుద్దీన్‌ను మద్యం తాగుదామంటూ పిలిపించారు. తిమర్‌పూర్ శ్మశాన వాటిక ప్రాంతంలో షంషుద్దీన్‌తో పూటుగా మద్యం తాగించి బండరాళ్లతో కొట్టి చంపి ఇరువురూ కలిసి హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. 19న రాత్రి తిమర్‌పూర్ ఏరియాలో ఢిల్లీ పోలీసులు షంషుద్దీన్ మృతదేహం గుర్తించారు. ఏసీపీ సీవర్ పటేల్ నేతృత్వంలోని బృందం సాంకేతిక ఆధారాలను సేకరించింది. ఇద్దరు నిందితులు హైదరాబాద్ నగరంలోని ఫలకునుమాలో ఉన్నట్లు గుర్తించి శుక్రవారం మధ్యాహ్నం పట్టుకుంది. ఢిల్లీ కోర్టులో హాజరుపరచనుంది.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

కేశంపేట: విద్యుదాఘాతంతో నెమలి మృతిచెందిన ఘటన శుక్రవారం కేశంపేట గ్రామంలో చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద కరెంట్ షాక్‌తో నెమలి చనిపోయిందని ఫారెస్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌ఖాన్ మృతి చెందిన నెమలిని తీసుకెళ్లారు. అనంతరం ఆమనగల్లు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో గుంత తీసి పూడ్చిపెట్టారు.


నెమలి కళేబరాన్ని పూడ్చిపెడుతున్న ఫారెస్టు అధికారులు, సిబ్బంది

11 మందికి రూ.1.37 కోట్లు రీఫండ్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన 11 మంది బాధితులకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రూ.1.37 కోట్లు రీఫండ్ చేయించారు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసుకున్న అధికారులు నేరగాళ్ల బ్యాంకు ఖాతాలు గుర్తించారు. వాటిలో ఉన్న మొత్తాలను ఫ్రీజ్ చేసి, న్యాయస్థానం అనుమతితో రీ ఫండ్ చేయించారు. బాధితుల్లో ట్రేడింగ్, ఫెడెక్స్, జాబ్, కస్టమర్ కేర్ తదితర ఫ్రాడ్స్‌లో నష్టపోయిన వారు ఉన్నట్లు డీసీపీ దార కవిత శుక్రవారం పేర్కొన్నారు. మరోపక్క నగరానికి చెందిన ఓ గృహిణికి (50) వాట్సాప్ డీపీ ద్వారా టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలు కాజేశారు. బాధితురాలి సోదరుడు అమెరికాలో ఉంటారు. ఈ విషయం గుర్తించిన సైబర్ నేరగాళ్లు ఓ వర్చువల్ నెంబర్ యాక్టివేట్ చేసుకున్నారు. దానికి వాట్సాప్ ఇన్‌స్టాల్ చేసుకుని, బాధితురాలి సోదరుడి ఫొటోను డీపీగా పెట్టుకున్నారు. ఆ నెంబర్ నుంచి బాధితురాలికి ఆమె సోదరుడిగా సందేశం పంపారు. అత్యవసరం అంటూ పలు దఫాలుగా వివిధ బ్యాంకు ఖాతాల్లోకి రూ.2 లక్షలు బదిలీ చేయించుకున్నారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

బడ్జెట్‌పై చర్చకు అవకాశం ఇవ్వరా?

- మేయర్ చాంబర్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ చట్టంలోని నిబంధనలు ఉల్లంఘిస్తూ కార్పొరేటర్లకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, బడ్జెట్‌పై చర్చకు అవకాశమివ్వకుండా, పలు నిబంధనలు ఉల్లంఘించి కౌన్సిల్ నిర్వహించారంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం మేయర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బడ్జెట్ సమావేశంలో పలు ఉల్లంఘనలకు పాల్పడ్డారని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మన్నె కవితారెడ్డి, హేమ సామల, రాసూరి సునీత, సింధురెడ్డి, శాంతిరెడ్డి, దేదీప్యారావు తదితర కార్పొరేటర్లు కమిషనర్‌కు రాసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో, అడిషనల్ కమిషనర్ శివకుమార్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. మేయర్‌తో సమావేశమైన కాంగ్రెస్ కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, బాబా ఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, మహాలక్ష్మిగౌడ్ తదితరులు అనంతరం మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ సభ్యులు సభను, మేయర్‌ను లెక్కచేయకుండా ప్రవర్తించారని, వారి అధిష్ఠానం మెప్పు కోసం వారిచ్చిన స్క్రిప్టు మేరకు వ్యవహరించారని ఆరోపించారు.

ఈవెంట్ గోదాంలో అగ్ని ప్రమాదం


గోదాం ఆవరణలో కాలిపోతున్న ఈవెంట్ సామగ్రి

- చెత్తను తగలబెట్టే క్రమంలో ఎగిసిపడిన నిప్పురవ్వలు
- నందుపల్లి గ్రామంలో సంఘటన

మహేశ్వరం: ఈ వెంట్ స్టేజీలకు ఉపయోగించే ఫైబర్ సెట్టింగ్ సామగ్రి నిల్వ గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధి నందుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఎలైన్ ఈవెంట్ ఆర్గనైజింగ్ నిర్వాహకులు.. నందుపల్లి గ్రామంలో వ్యవసాయ పొలాన్ని లీజుకు తీసుకున్నారు. ప్రోగ్రాం అనంతరం సెట్టింగ్ పరికరాలను ఇక్కడి గోదాం, ఆవరణలో భద్రపరుస్తుంటారు. శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా చెత్తను ఊడ్చి, కుప్పగా పోసి నిప్పుపెట్టారు. సమీపాన గోదాం ఉండడంతో నిప్పు రవ్వలు గాలికి ఎగిరి గడ్డంగిపై పడ్డాయి. దీంతో మంటలు అంటుకుని సామగ్రి పూర్తిగా దగ్ధమయింది. గోదాం ఇన్‌చార్జి మంటలను ఆర్పే లోపు దట్టంగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్ని మాపక అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎక్కువశాతం సామగ్రి కాలిపోయిందని పోలీసులు తెలిపారు.

విద్యారంగంపై ప్రాధాన్యం పెరగాలి

పౌరహక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్


వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్ చిత్రంలో హరగోపాల్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగంపై మరింత ప్రాధాన్యత పెరగాలని పౌరహక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం పరిధి మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. పేద పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్నారులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యాభివృద్ధికి కావాల్సిన వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎంతో మంది గొప్ప వ్యక్తులు చదువుకున్న పాఠశాలకు పాలమూరు బిడ్డ సీఎం రావడం చారిత్రాత్మకమన్నారు. హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, విద్యాశాఖ మాజీ మంత్రి శ్రీనివాసరావు వంటి వారు ఎందరో ఇక్కడ విద్యనభ్యసించారని గుర్తు చేశారు. చరిత్ర కలిగిన పాఠశాలను అభివృద్ధి చేస్తే.. ఎంతో ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, నాయకులు తిరుపతిరెడ్డి, కాశీనాథ్ రెడ్డి, అగ్గనూరు బస్వం, రఘు పాల్గొన్నారు.

1,190 ఫోన్లు రికవరీ

బాధితులకు అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న రూ.3.55 కోట్ల విలువ చేసే 1,190 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఆయా మొబైల్స్‌ను క్రైమ్స్ డీసీపీ కే నర్సింహ శుక్రవారం బాధితులకు అందజేశారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) సహాయంతో ఫోన్లను 50 రోజుల వ్యవధిలోనే రికవరీ చేసినట్లు తెలిపారు. అత్యధికంగా ఐదు జోన్లలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు 1,010, లా అండ్ ఆర్డర్ పోలీసులు 180 ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వివరించారు.